# ఆగు

[illegible] రామచంద్ర

ఆఫీసునుంచి వచ్చి స్నానంచేసి బాత్‌రూమ్ నుండి బయటపడ్డానోలేదో– "మీ కోసం ఏవరోవచ్చా"రంది శ్రీమతి ఆ మాట చెప్పడానికి కాచుకున్నట్లు. ఆమె కంఠంలో కొంచెం విసురూ మరికొంత విసుగూ ఉంది. అది న్యాయమే. మా సంసార జీవితంలో సాయంత్రాలకు ప్రాముఖ్యత ఉంది. కబుర్లు చెప్పుకుంటూనో, షికారు వెళ్లో.... షాపింగ్ చేస్తూనో గడుపుతాం సాయంత్రాలు. అటువంటి సాయంత్రంమీద కెవరయినా దాడిచేయబోతే ఆమెకు కోపం రాకేం చేస్తుంది?

బనియనూ, లుంగి అందుకోబోయాను, బీరువాలోంచి.

"వచ్చిందీ– అమ్మాయి." గొంతులోంచి అసూయ.

ఒక్క క్షణం కింకర్తవ్యవిమూఢుడినై ఆగాను.

"సూట్ యిచ్చేదా?" కంఠంలో వెక్కిరింపు.

అర్ధాంగి మాటకు వెయ్యి అర్థాలు. నాకున్నది ఒకే ఒక్క సూట్. అదీ- పెళ్ళికి మా మామగారు పెట్టినది. పెళ్ళయ్యేవరకూ నేను చాలా ప్రేమ కథలు వ్రాశాను. అవి చాలా మందికి నచ్చేవి కూడా. పెళ్ళయి ఏడాది తిరిగేసరికి శ్రీమతి నామీదా నాకథలమీదా కూడా అధికారం సంపాదించి- అదుపులో పెట్టింది.

"మీరిక కుర్రతనపు ప్రేమ కథలు రాయడానికి వీల్లేదు. సాయంత్రాలు క్లబ్బులూ పార్టీలూ అంటే లాభంలేదు. నాతోనే గడపాలి. రాత్రి పది దాటాక పెద్దదీపం వెలగకూడదు-"

సహజీవన సౌభాగ్యం నిలుపుకుందుకు ఆమె షరతులకు తలవొగ్గాను. అంతమాత్రంచేత నేను రాయడం పూర్తిగా మానేశాననికాదు. కొట్టేచెయ్యా.... తిరిగేకాలూ.... రాసేకలమూ ఊరుకోలేవుకదా? సీరియస్‌కథలు....ప్రేమలూ అమ్మాయిలూలేని ఎడారి కథలూ పాడికథలూ వ్రాస్తున్నాను.

"సీరియస్! కథలనిసీరియస్‌గా తీసుకోనక్కలేదు. అందులోనూ ప్రేమకథలు పొట్టి కాలక్షేపం బఠానీలు మాత్రమే...." ప్రేమకథలు రాసుకోనిమ్మని అడగకపోలేదు నేను.

"ఏవయినా కథలు కథలే. పాడుచేసేందుకు ప్రేమ కథలూ చాలు. రచయితలయ్యుండీ అలా మాట్లాడతారేం?"

ఆమె అన్నాక నాకు మరి మాటలు దొరకలేదు.

"కాఫీ అక్కడికే పంపుతాను. బహుశా మీకిక టిఫిన్ అవసరముండదు-"

ఎత్తిపొడుపు.

నవ్వి ఊరుకున్నాను. ఆడవాళ్ళ మాటలలో వెయ్యేకాదు. యింకా ఎక్కువే అర్థాలుంటాయి గ్రహించగలిగితే.

వీధి గదిలోకి నడిచాను అక్కడ ఆమె ఉంది.

"నేను మూర్తిని" నమస్కరించాను.

"నా పేరు సునీత. మీ పాఠకులలో ఒకరిని" లేచి చేతులు జోడించింది

"సంతోషం... కూర్చోండి."


"థాంక్స్. మీ కథ- ఆగు- చదివాను."

"అదివొచ్చి చాలా కాలం కాలేదూ?"

"ఔను, కాని దాని ప్రభావం యింకా కరిగిపోలేదు"

గర్వపడ్డాను. పత్రికలో వారం మాత్రమే బ్రతికే కథ. పాఠకులలో పదినెలలు నిలిచిందంటే రచయితకింకేం కావాలి? 'ఆగు' కథ చాలా తీవ్రంగానే రాశాను ఆడపిల్ల పెళ్ళి భారత దేశ జనాభా- రెండిటి ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని అంకుశంలాటి కథను

దేశ జనాభా దారుణంగా పెరిగిపోతూంది ఆడపిల్ల పెళ్ళి వెయ్యియజ్ఞాలు చేయడంకంటె కష్టమౌతూంది కుటుంబంలో ఒక్క ఆడపిల్ల పెళ్ళిచేస్తే ఆ కుటుంబం కుదేలయిపోతూంది అందుకని పిల్లల్ని కనిపారెయ్యవద్దని చెబుతూ సూటిగా వ్రాశాను- కథ స్పష్టంగానే ఉంటుంది



తయారుచేశాను, అది చదివితే పిల్లల్ని కనడానికి ఆగవలసిందే.

"ఆ కథ మీరెందుకు రాశారు?" అడిగింది నీరజ

తెల్లబోయాను. "ఆ కథ స్పష్టంగానే ఉంటుందే, సటిల్‌గా ఉండదే!—

దేశ జనాభా దారుణంగా పెరిగిపోతూంది. ఆడపిల్ల పెళ్ళి వెయ్యి యజ్ఞాలు చేయడంకంటె కష్టమౌతూంది. కుటుంబంలో ఒక్క ఆడపిల్ల పెళ్ళిచేస్తే ఆ కుటుంబం కుదేలయిపోతూంది. అందుకని పిల్లల్ని కనిపారెయ్యవద్దని చెబుతూ సూటిగా వ్రాశాను."

"ఆ మేరకయితే మీరు కృతకృత్యులయినట్లే"

"థాంక్స్."

"మీరు కథలెందుకు రాస్తారు?"

నివ్వెరపోయాను, ఏమిటి ప్రశ్న? దీనికేం జవాబు చెప్పేది? కాలక్షేపం కోసం పేరు కోసం.. పారితోషికాలకోసం.. అనా?

"మీకొక కథ చెబుతాను వింటారా?"

కుదుటపడ్డాను. ఈమె వర్ధమాన రచయిత్రి కాబోలు. అందుకే అడిగి ఉంటుందలాగ.

"చెప్పండి" ఉషారుగా అన్నాను.

ఆమె మొదలు పెట్టింది.

* * *

వంటింటి పనులు పూర్తిచేసుకుని శుభ్రంగా తయారై పడక గదిలోకి వచ్చిందామె. ఆ సామాన్య కుటుంబంలో అవే ఆ దంపతులకు మధుర క్షణాలు. రోజు మొత్తంమీద వాళ్లు హాయిగా ఉండేదా కొద్ది సేపే.

ఆమె అతని పక్కనే కూర్చుని జుత్తులోకి వేళ్లు పోనివ్వ బోయింది.

"ప్లీజ్—" పాము పక్కలోకి వచ్చినట్టు త్రుళ్ళి పడ్డాడతను. మనిషి—వౌణికి పోతున్నాడు!

"ఏమైంది మీకు? ఇందాకటి వరకూ బాగానే ఉన్నారే?"

"ఉహూ....ఇది....యీ కథ చదువ్...."

"కథ చదివితే కంగారూ భయమూ ఎందుకూ? దెయ్యం కథా?"

"మనుషుల కథే—" అతను దూరంగా వెళ్ళిపోయాడు.

ఆమె ఆశ్చర్యపోతూ ఆ కథ చదివింది.

అప్పుడన్నాడతను. "జనాభా పెరిగితే ప్రళయమే. మనం—మన జీతంతో బొటా బొటిగా బ్రతుకుతున్నాం. ఆడపిల్ల పుట్టిందో మన సంసారం వీధిన పడుతుంది. తెలిసీ ఆ తప్పు చెయ్యొద్దు. రొంపిలోకి దిగవద్దు—"

"పిల్లలు రొంపి! ఈ కథ చదివి మీ మనసు చెడిపోయింది. అంతేకాని....బొత్తిగా పిల్లలులేని సంసారం అదేం సంసారం? అది అర్థంలేని దాంపత్యం."

"ప్లీజ్....నన్ను బాధ పెట్టకు."

రోజులు....నెలలు గడిచాయి. అతనిలో మార్పు రాలేదు. అతను పడకగదిలో కాకుండా వరండాలో పడుకుంటున్నాడు. అప్పుడప్పుడు ఆగు కథ చదువుకుంటున్నాడు. ఇరవయ్యేళ్ళ యౌవనం ఆమెను ప్రతి రాత్రీ హింసించి వదులుతూంది. తను దగ్గరకు చేరబోతేనే అతను కట్టెలా బిగుసుకుపోయి పిరికి వాడిలా పరుగెడతాడు. వసంత రాత్రిలా గడపవలసిన కాలం—కాళ రాత్రిలా గడుస్తూంది. ప్రతి రాత్రీ శివరాత్రే ఔతూంది. భరించలేక అతన్ని డాక్టరుకి చూపించి విషయం చెప్పింది. కథలు చదవకుండా చూడడం తప్ప వేరే ట్రీట్ మెంట్ లేదన్నాడు.

అతనిలో మార్పు రావడంలేదు. అర్ధరాత్రి-'ఆడపిల్ల ఆడపిల్ల' అంటూ భయంగా కలవరిస్తాడు. ఆమెకు ఏడుపొస్తుందతన్ని చూస్తే. ఎంత భయనీయమయిన పరిస్థితో ఆలోచించండి."

"ఔను. ఊహించేందుకే బాధగా ఉంది."

"అనుభవిస్తే మరీ దుర్భంగా ఉంటుంది." కటువుగా కోపంగా అందామె.

"కథ చెప్పి—అంత చలించి పోతారేం?"

"అది-నా కథ....వ్యధ కనుక." కాళిలా రెచ్చిపోయిందామె. "మీ కథతో రెండు జీవితాలను నాశనం చేశారు. పిల్లలు రొంపి! ఎవరు చెప్పారు మీకు? మీరు స్త్రీ ఐతే తెలిసేది మాతృత్వంలో మాధుర్యం. గొడ్రాలుగా మిగలడం ఎంత శాపం!

జీవితమన్నాక సుఖమూ ఉంటుంది, దుఃఖమూ ఉంటుంది.

భయమూ ఉంటుంది. భద్రతా ఉంటుంది.

తీపీ ఉంటుంది, చేదూ ఉంటుంది.

నాణానికి లాగే జీవితానికీ రెండు పక్కలూ ఉంటాయి. జీవితం-భయపెట్టే బూచే కాదు, సుఖపెట్టే స్వర్గం కూడా. జీవితం పట్ల సమదృష్టిఉండాలి. రచయితలకి మరీ అత్యవసరం.

పాఠకులలో అమాయకులూ బలహీన హృదయులూ కూడా ఉంటారు. వాళ్ళని భయపెట్టే....వారి మనసులు కలుషితంచేసే కథలు రాయడం సంఘ విద్రోహమే ఔతుంది. అటువంటి నిర్లక్ష్యం తీవ్రమైన నేరమే.

మీకు చేతనయితే జీవితం పట్ల ప్రేమను పెంచగలిగే కథలు వ్రాయండి. అంతే తప్ప మనుషులను భయపెట్టి జీవితం పట్ల గుడ్డివాళ్ళని చేసే కథలు మాత్రం వ్రాయకండి.

నేను వొచ్చింది—మిమ్మల్నభినందించాలని కాదు. హెచ్చరించాలని. ఇకనుంచి కథ వ్రాసే ముందు-మీ కథ మంచికి చెడుని కలిగిస్తుందా, చెడుకి మంచి చేస్తుందా అని యోచించి మరీ వ్రాయండి. రచయితగా అది మీ కనీస బాధ్యత.

కలవ్."

వెళ్ళి పోయిందామె.

నేను చాలా సేపటివరకూ తేరుకోలేక పోయాను.

"కాఫీ—" అందించింది శ్రీమతి. నీరసంగా అందుకున్నాను. *



పిచ్చి

"దాదా! నన్ను ప్రేమించడం మంచిదని నువు మొదటిసారిగా ఎప్పుడనుకున్నావ్?" అడిగాడు మాధవరావు.

"ఎప్పుడేమిటి? నాకు పిచ్చెక్కినప్పట్నుంచీ....." అంది దాద.

–జి. కామేశ్వరి (కాంతినగర్)